కథ

# మమకారం

జనార్దన సూరి



"థాంక్‌గాడ్! కారు ఇక మనదైపోయింది. ఇలా ఇంటి ముందు మన కారు పార్కు చేసి వుంటే బావుంది కదూ!'' మా శ్రీమతి మాట్లాడుతోంది. నాతో ప్రత్యేకంగా ఏమీ మాట్లాడడం లేదు. అలా అని జాగ్రత్తగా వినక పోయినా ముప్పే. మధ్యలో ఏదైనా ప్రశ్న వేస్తే! దానికి కూడా తలూపితే కోపం రాదూ!



## హిందీ తెలియని ట్వింకిల్

*'**ట్వింకిల్** ట్వింకిల్ లిటిల్ స్టార్ – ప్లీజ్ సైన్ ఇన్ హిందీ ప్లీజ్..' అని అడిగాడట ఓ విలేఖరి – పాపం ట్వింకిల్ ఖన్నా కాన్వెంట్ చదివిన పిల్ల గదా అని. అయినా ససేమిరా అన్నదిట అమ్మడు. కోపం కొద్దీ కాదు. ట్వింకిల్‌కి హిందీలో రాయడం అసలు రాదుట. మరి హిందీ సినిమాల్లో ఎలా యాక్టు చేస్తున్నావంటే – అంటే రాయడం రాదన్నాను గానీ, చదవడం, మాట్లాడటం రాదని నే అన్నానా? అంటోంది గడుసుగా. (డబ్బింగ్ ఆర్టిస్టులున్నప్పుడు ఏ భాషైనా వస్తే ఏంటి? రాకపోతే ఏంటి?')*

**"ఇ**దే కారు వారం రోజుల నుంచి ఇక్కడే వుంది కదోయ్'' అన్నా. వారం రోజుల క్రితం మాధవరావు తన కారుని అమ్మడానికి తీసికెళ్తూ మా ఇంటికి వచ్చాడు. మా ఆవిడ అందించిన కాఫీ తాగుతూ ఆవిడకు వినిపించేటట్టుగా నాతో చెప్పాడు, ''లక్కీ వెహికిల్. కానీ అమ్మదామనుకుంటున్నా. ఎలాగూ నెల రోజుల్లో ఫారిన్ వెళ్తున్నా. ఈ డబ్బు కూడా ఉపయోగపడుతుంది.''

''నీకు ఈ డబ్బే కావాలా వెళ్ళడానికి! మరీ చెప్తావ్'' అన్నా.

''వెళ్ళడానికి అక్కరలేకపోయినా, రావడానికైతే కావాలి'' చమత్కరించాడు మాధవరావు.

''బడాయి. రానూపోను పెట్టుకోకుండా వున్నావా నువ్వు?''

''మా ఆవిడిచ్చిన లిస్టు ప్రకారం అన్నీ తేకపోతే రానివ్వదు తెలుసా'' అంటూ నవ్వాడు.

కన్నింగ్ ఫెలో. డబ్బు లేనట్టూ మాట్లాడతాడు, ఉన్న ఫోజూ కొడతాడు. దొరకడు వెధవ. అన్నిటికన్నా నా బాధ వీడి ప్రగల్భాలు మా ఆవిడ వింటూందని, అవి ప్రగల్భాలని తెలియక, నన్ను పోల్చి, చవటకింద లెక్క కడుతుందని.

మాధవరావు పన్నాగం పారింది. ప్రోగ్రాం మార్చి, వాడి కారుని అక్కడే వదిలేసి, నాతోపాటు క్లబ్‌కి వచ్చాడు. తిరిగి వచ్చేటప్పుడు దార్లో వాడి ఇంటి దగ్గర దిగిపోయాడు.

''మనం ఉంచేసుకుందామండీ'' ఇంట్లోకి అడుగుపెట్టగానే మా శ్రీమతి పలకరింపు. అప్పటికి చాలాసార్లు మాధవరావు కారుని కిటికీ అద్దంలోంచి చూసి వుంటుంది.

''వాడేమీ తక్కువలో ఇవ్వడు. అవసరంలో అమ్మినా మంచి బేరానికే అమ్ముతాడు'' నచ్చ చెప్ప చూశా.

''తక్కువకోసం ఆశపడుతున్నానా? అయినా వీలుంటేనే. ఇప్పుడది లేకపోతే ఏం మునిగిపోలే'' రుసరుస.

''నీ ఇంటి ముందే ఉందిగా.''

''చాల్లే. ఇంటి ముందుంటే నాది అవుతుందా?''

''ఉన్నంతసేపూ నీది అనుకుని సంతోషపడ రాదూ.''

''ఔనౌను. కనిపిస్తున్న చార్‌మినార్ కూడా నాదే కదూ!''

''గుడ్.''

''నాకు కోపం తెప్పించవద్దు.''

'మాధవరావుకి చెప్పి మంచి ఫారిన్ పెర్ఫ్యూమ్ తెప్పిస్తాలే.'' విసవిసా నిష్క్రమణ మా ఆవిడ సీన్ నుంచి. ఈ వారం రోజుల్లో మాధవరావుకు డబ్బు ఎరేంజ్ చేశాను కష్టపడి. అప్పటి వరకూ సంతోషపడనని భీష్మించుకున్న మా శ్రీమతికి దీక్ష విరమణ జరిగి సంతోషపడడం జరిగింది.

●●●

చలపతి ఇంటికి పార్టీకి వెళ్ళాం. చాలాసేపు కూర్చున్నాం. కానీ కాన్సిల్ అయిన పార్టీలో ఎరేంజ్‌మెంట్స్ అన్నీ అయ్యే ఉన్నాయి. కానీ ఒక్కరూ ఏమీ ముట్టలేదు. మంచి నీళ్ళు మాత్రం తాగుతూ, తిండి పదార్థాల మీదకు దొంగచూపులు చూస్తున్నారు. కారణం టి.వి.న్యూస్.


గోదావరి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. అందులో చలపతి బావమరిది ప్రయాణం చేస్తున్నాడు. అతని సంగతి తెలియని చలపతి భార్య ముందే కీడుని శంకించి బాధపడుతూ ఉంటే, చలపతి వంత పాడుతున్నాడు. వచ్చిన అతిథులు కూడా అడిగిన ప్రశ్నే మళ్ళీ మళ్ళీ వేస్తున్నారు. ఓదారుస్తున్నారు. ఉఫ్ఫులు వెదజల్లుతున్నారు.

నెమ్మది నెమ్మదిగా పల్చనైనారు వచ్చిన గెస్ట్‌లు. చలపతి తమ్ముడు టెలిఫోన్‌ని వదిలిపెట్టడం లేదు. ఇన్‌ఫర్‌మేషన్ వేటలో వున్నాడు. 10.30 అయింది. టెలిఫోన్ మ్రోగింది. చలపతి తమ్ముడు లోపలికి వెళ్ళినట్టున్నాడు. చలపతి తన భార్యను సాంత్వనపరుస్తూ, అందరితో మాట్లాడుతున్నాడు.

నేనే వెళ్ళి ఫోను ఎత్తాను. చలపతి బావమరిది!

''ఎంత సేపటి నుంచి ట్రై చేస్తున్నానో...''

ఇక్కడ ఫోన్‌ని ఎడాపెడా వాయిస్తుంటే ఎలా దొరుకుతుంది నీకు? సంగతేమిటంటే, వాడు సేఫ్. ఏదో పనిమీద ముందు స్టేషన్లోనే దిగిపోయాడు. యాక్సిడెంటు సంగతి వాడికి చాలా లేటుగా తెలిసింది. తెలీగానే ఇక్కడ వర్రీ అవుతారేమోనని ఈ సంగతి చెప్దామని ట్రై చేస్తున్నాడు. హమ్మయ్యా ఇప్పటికైనా దొరికింది. ఆఖరు ప్రయత్నం చేసి వెళ్ళి



పోదామనుకుంటున్నాడు.

''పాపం చాలా 'బెంగ పడిందండీ'' తిరిగి వస్తూంటే అంటూంది మా ఆవిడ.

''అవును పాపం. కానీ ఇప్పుడు తీరిపోయిం దిగా.''

''మీరొక పెద్ద వేదాంతి. బ్రదర్ సేఫ్ అని తెలిసినా తీరదా ఆరాటం?''

''కానీ యాక్సిడెంట్‌లో మార్పు లేదుగా.''

''అయితే.''

''నిజమే కదూ! యాక్సిడెంటుకి గురి అయిన వాళ్ళల్లో ఆమెకి 'నా' వాళ్ళు లేరు కదూ!''

''ఇలాంటి మాటలు అందరి దగ్గరా అనేరు.''

●●●

బాబిగాడు దీపావళికి వచ్చాడు. 'రెసిడెన్షియల్ స్కూల్‌లో వెయ్యడం ఎందుకు, దగ్గర లేడని బాధ పడడం ఎందుకు, మళ్ళీ చూడగానే ఆనందంలో తలమునకలవడం ఎందుకు' అన్నది మా ఆవిడకే బాగా తెలుసు.

''ఏం ఆమాత్రం మనం డబ్బు కట్టి చదివించ లేమా?'' అంది ఒకసారి. చాలదా? మళ్ళీ మళ్ళీ ఎందుకు అడుగుతాను నేను?

ఇంట్లో ఉన్న చిన్నగాడికి, బాబిగాడికి ఇద్దరికీ సరిపడా బాణాసంచా వచ్చింది ఇంట్లోకి. ఇద్దరికీ పంచి ఇవ్వడం కూడా జరిగింది. దీపావళి నాడు భోజనం అయిన దగ్గరి నుంచీ ఎంతకీ చీకటి పడదేమోనని ఎదురు చూస్తున్నారు ఇద్దరు పిల్లలూ. వాళ్ళ ఎదురు చూపులు ఫలించి, ఆ రోజు కూడా చీకటి పడింది. హడావిడి మొదలు. కేరింతలు కొడుతున్నారు ప్రతీ ప్రేలుడికీ. అమావాస్య చీకటిలోని కాకర పువ్వొత్తుల కాంతులు వాళ్ళిద్దరి మొఖాల్లోని ఆనందాన్నీ స్పష్టంగా చూపిస్తున్నాయి.

కాస్సేపట్లో వాతావరణంలో కొద్ది మార్పుని గమనించాను. చిన్నగాడి బాణాసంచాలోని కొన్ని సామాన్లు వాడికి తెలియకుండా తగ్గిపొయ్యాయి. ''నేనెందుకు తీసుకుంటా'' అని బాబి దబాయింపు.

''ఇంకెవరు తీశారు?'' అని చిన్న లాజిక్.

నేను కలుగజేసుకోలేదు. వాళ్ళ అమ్మే ఏదో తిప్పలు పడుతోంది. పిచ్చి సన్నాసులు. ఎవరు కాల్చినా, వెలిగేది ఆ కాకరపువ్వే కదా! ఎవరు ముట్టించినా పేలేది ఆ టపాకాయే కదా! ఎవరిచేత్తో వెలిగిస్తే ఏమయింది? 'నాది' అనుకుంటేనే తృప్తా? వెలుగుతున్న కాకరపువ్వులను చూసి సంతోషించక, 'నాది వాడు వెలిగించాడు' అని పోటీయా?

''బాబీ చాలా తప్పు. ఎప్పుడూ అలా చెయ్యకు. ఇద్దరికీ సమానంగా పంచిన తర్వాత ఎందుకురా అది?'' వాళ్ళ అమ్మ కోప్పడుతోంది.

●●●

మాకు తెలిసిన సి.ఎ ఫ్రెండు కొత్తగా ఆఫీసు పెట్టాడు స్వంత ప్రాక్టీసుకి. ప్రాక్టీసులో వున్న మమ్మల్నందరినీ, వాళ్ళ ఫ్రెండ్స్ వగైరాలందరినీ పిలిచాడు అతను. అంతా మోడ్రన్‌గా వుంది ఆఫీసు. కాబిన్స్, ఫర్నీచర్, సోఫాసెట్, కంప్యూటర్స్, ఫాక్స్, చిన్న ఫ్రిజ్, టెలిఫోన్, పి.బి.ఎక్స్‌లతో చాలా హంగుగా ఉంది ఆఫీసు.

''వాళ్ళ తమ్ముడు ఆర్కిటెక్ట్. డిజైన్లన్నీ పట్టుకొచ్చాడు ఇందులోకి'' ఎప్పుడు పక్కకి వచ్చాడో, పరిచితుడైన సి.ఎ కొలీగ్ శ్రీహరి నా చెవిలో నెమ్మదిగా ఊదాడు.

అతని వైపు చూసి, ''హలో'' అన్నా. అతను ఇంకా ఆఫీసు అలంకరణలని చూస్తూనే ఉన్నాడు. అతని చూపు చాలా గమ్మత్తుగా ఉంది. వివరాలన్నీ సేకరిస్తున్నాడు. కానీ, పాత సామాన్లు కొనేవాడిలా, ఎందుకూ పనికి రానివి చూస్తున్నట్టుగా ఉన్నాడు. ఏదీ చూడకుండా ఉండ డం లేదు. కానీ, ఎందులో లోపం కనిపిస్తుందా అని వెదుకుతున్నాడు.

ఇలాంటి వాళ్ళకి బావున్నా తంటానే. బాగోలేక పోయినా అంతే. ఇదే అతని ఆఫీసే అయితే! ఎంత ఆనందంతో ఉర కలు వేసేది అతని మనస్సు! దీన్నే కాస్సేపు 'నా ఆఫీసు' అనుకుని సంతోషపడితే అతని సొమ్మేం పోయిం ది?

'నాది కాదు' అన్న జ్ఞానం అతన్ని ఆనంద పడ నివ్వడం లేదు. 'ఎందుకూ పనికిరాని, సంతోషపడ నివ్వని జ్ఞానం!' అనిపించింది. మళ్ళీ నా లోకంలోకి నేను వెళ్ళిపోయాను.

●●●

మళ్ళీ పదిహేను రోజుల తర్వాత కనిపించాడు శ్రీహరి.

''మా ఆఫీసుకి రా. ఈ రోజు చిన్న గెట్ టుగెదర్ ఉంది'' అంటూ తన విజిటింగ్ కార్డు నా చేతి కిచ్చాడు.

అడ్రసు చూశాను. నా ఆశ్చర్యాన్ని గమనించి,

''పార్టనర్‌షిప్‌లో ప్రాక్టీసు మొదలుబెట్టాం. ఆఫీసు మంచి లొకేషన్‌లో వుంది. పైగా, నేను నమ్మనుకో, కానీ వాస్తుప్రకారం పెర్ఫెక్ట్ అంటున్నారు అంతా'' అన్నాడు.

పదిహేను రోజుల క్రితం జేవురించిన మొఖంతో చూసిన ఆఫీసే ఇప్పుడు 'తన'ది కూడా అయ్యేటప్పటికి చాలా మంచిదయింది.

మెకానిజం అర్థమైంది. సంతోషించాలో, విచారించాలో, మెచ్చుకోవాలో, ఈర్ష్యపడాలో ముందే నిర్ణయించుకో. దాన్నిబట్టి నీ స్వంతం అనుకోవాలో, పరాయిదనుకోవాలో తెలిసిపోతుంది.

కాదు కాదు. నీదో కాదో తెలుసుకో. దాన్ని బట్టి ఆనందపడాలో వద్దో అర్థమవుతుంది. అహా అదీ కాదు. ఏది ఎవరిదో గమనించు. ఆ మనిషికీ నీకూ ఉన్న సంబంధాన్ని బట్టి నీ ఫీలింగ్ మారుతుంది. అబ్బే. ఇదీ సరిగ్గా లేదు.

ఏమో, కన్‌ఫ్యూజన్ ఎక్కువైంది. ఇది 'నా' సమస్య కాదు.


**రూ.2,50,000 విలువైన బహుమతులు గెలుపొందండి**

| | | |
|---|---|---|
| 5 | | |
| | 6 | |
| | | 7 |

| | | |
|---|---|---|
| 4 | 9 | 2 |
| 3 | 5 | 7 |
| 8 | 1 | 6 |

**ప్రత్యేక బహుమతి:**
హీరో హోండా మోటార్ సైకిళ్ళు లేదా చేతక్ స్కూటర్ లేదా కలర్ టి.వి.
**కన్సొలేషన్ బహుమతులు:**
పరస్పర లాభం పథకం క్రింద
కెమెరా, టూ-ఇన్-వన్ ట్రాన్సిస్టర్, శారీస్, చేతి గడియారాలు.
ఉదాహరణలో చూపినట్లుగా కాంపిటీషన్ పోస్ట్‌కార్డ్/ ఎన్వలప్/ ఇన్‌లాండ్ లెటర్ మీద 9 చదరాలు గీయండి మరియు 2 నుండి 10 వరకు గల అంకెలనుపయోగిస్తూ, అడ్డంగా, నిలువుగా మరియు ఏటవాలుగా ఎటుకూడినా మొత్తం 18 వచ్చేట్లు చూడండి. ఒక అంకె ఒకేసారి ఉపయోగించాలి. మీ ఎంట్రీలను ఆర్డినరీ మెయిల్ ద్వారా 10 రోజుల్లోగా పంపించండి. మొదట స్వీకరించిన 10 ఎంట్రీలకు టైటాన్ వాచ్ గోల్డెన్ చెయిన్ బహూకరించబడును.

**HERO ENTERPRISES ( 10 )**
**VASUNDHARA, DELHI -110096**